మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఝరాసంఘం, మార్చి 4, (ప్రభాతవార్త):** మహాశివరాత్రి నవహ్నిక జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వ తారీకు నుంచి మండల కేంద్రమైన ఝరాసంఘంలో పార్వతీ దేవితో కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వరుడి ఆలయంలో నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.

**జాతర కార్యక్రమ వివరాలు...**

ఈ నెల 7న శేషవాహన సేవ, 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 10న తెల్లవారు 4.30 గంటలకు అగ్ని గుండము, 5.30 గంటలకు కళ్యాణోత్సవం, 10.30 గంటలకు రథోత్సవము, 19న మమర రుద్రాభిషేకం, నంది వాహన సేవ, 13న లక్ష బిల్వార్చన, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఇ.ఒ. శేఖర్ పేర్కొన్నారు.

## బుడగజంగాల కాలనీలో పోలీసుల దాడి

### 35 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీనం.. వ్యక్తిపై కేసు నమోదు...

**హుస్నాబాద్, మార్చి4,(ప్రభాతవార్త)**

హుస్నాబాద్ పట్టణంలోని బుడగజంగాల కాలనీలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నివాసం ఉంటున్న చెన్నూరు రవీందర్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 70 బస్తాలు మొత్తం 35 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బుడగజంగాల కాలనీలో గత కొద్ది రోజులుగా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వఉంచారని నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.ఇంకా ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తెలిసిన వారు 100,పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## 'ప్రజావాణి'లో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

'ప్రజావాణి'లో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను అదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని అధికారులు శాఖల వారీగా స్వీకరించిన దరఖాస్తులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, డిఆర్వో నాగ రాజమ్మ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్‌పోటీలో ఆకునూరు విద్యార్థులు

**చేర్యాల, మార్చి 4, ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్ రాష్ట్ర హత్రాస్ పట్టణంలో ఈనెల 6 నుంచి 13 వరకు జరగనున్న 52వ ఉమెన్స్ పోటీలలో చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన తుంగ అనూష, గూడూరు రవళి పాల్గొననున్నట్లు హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మహమ్మద్ రఫత్ ఉమర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా రఫత్ మాట్లాడుతూ విద్యార్థిని తుంగ అనూష ఎస్‌జిఎఫ్ అండర్ 17లో గోల్డ్ మెడల్ సాధించిన జట్టులోని సభ్యురాలని ఈమె 6వ సారి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటుదని, రవళి రెండవ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించి జిల్లా, మన ప్రాంతం పేరును నిలబెట్టాలని కోరారు.

## కలెక్టరేట్‌లో జాతీయ మహిళా దినోత్సవం

**సంగారెడ్డి టౌన్, మార్చి 4, ప్రభాతవార్త:** జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని టిఎన్జీఓస్ జిల్లా అధ్యక్షులు ఎండి జావిద్ అలీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆట పాటలతో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి డిఆర్ఓ జి.పద్మజారాణి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఆటపాటలతో కార్యక్రమాలను జరుపుకుని మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవదర్ధక శాఖ జెడి వసంత కుమారి, జిఓఎండి ఇందిరా దేవి, జిల్లా కార్యదర్శి జి వవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, పి వెంకటరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, కే మమత, నిర్మల, రాజకుపమారి, సుధారాణి, వి విజయ్‌కుమార్, సంగారెడ్డి తాలుకా బాధ్యులు యాదవరెడ్డి, వెంకటేశం, భాస్కర్, షకీల్, ఆంజనేయులు, శ్రీనివాస్, సుధారాణి, ప్రమోద, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపి

### -పటేల్‌గూడ ఎల్లంకి కళాశాలలో విజయ సంకల్ప సభ



ప్రధాన మోడీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి బిబి పాటిల్

**జహీరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** ఈ నెల 5వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొననున్న కార్యక్రమాన్ని పురస్కరించుకుని కొనసాగుతున్న ఏర్పాట్లను జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి బిబి పాటిల్ మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించి పార్టీ విజయసంకల్ప యాత్రలో పాల్గొంటారన్నారు. కార్యక్రమం విజయవంతంగాని జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో చేరుకోవాలని సూచించారు. 5న ఉదయం 9 గంటలకు నిర్వహించే విజయసంకల్ప సభలో ప్రధాన మంత్రి పాల్గొంటారన్నారు. నరేంద్ర మోడీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే దిశగా పాలన కొనసాగి స్తున్నారని గుర్తు చేశారు. ప్రగతిపథంలో భారత దేశాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. సంగారెడ్డి జిల్లా పూణే-హైద్రాబాద్ రహదారిలో సంగారెడ్డి చౌరస్తా మదినగూడ వరకు 31 కిమీటర్లు 6 లైన్ల జాతీయ రహదాఇ విస్తరణను 399 కోట్లతో ఎల్లారెడ్డి-రుద్రార్ 2లైన్ హైవేను 5వందల కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారన్నారు.

## విజయ్ సంకల్ప సభను జయప్రదం చేయండి

### -బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి4 ప్రభాతవార్త:** ప్రధాని మోడీ విజయ్ సంకల్ప సభ సంగారెడ్డి జిల్లాలోని పటేల్‌గూడలో నేడు ఉదయం 10.30 గంటలకు జరుగనుందని, ఈ సభలో కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు రామ మందిరం నిర్మించిన వ్యక్తి, బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేసిన మహానుభావుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మెదక్ పార్లమెంట్‌లోని పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటేల్ గూడుకు వస్తున్నారని, ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి అయిన ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేస్తున్న శుభ తరుణంలో ఈ సభలో కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మరోసారి మోడీని ప్రధాన మంత్రిని చేయడానికి మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని గెలిపించడానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ప్రధాని మోడీ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్‌ఎన్ రెడ్డి, మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్, ఆకుల ప్రభాకర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ, సన్నీ, రాహుల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పౌర పఠన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



పౌర పఠనకేంద్రాంను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

**చేర్యాల, మార్చి 4, ప్రభాతవార్త**

పౌర పఠన కేంద్రాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. చేర్యాల మండలంలోని చుంచనకోట, ముస్త్యాల గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పౌర పఠన కేంద్రాలను సోమవారం అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతి, యువకులు పౌర పఠన కేంద్రాలను సద్వినియోగం చేసుకుని వివిధ పోటి పరీక్షలకు కావలసిన విధంగా వినియోగించుకోవాలన్నారు. పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సమయం ముగిసిన అనంతరం తప్పనిసరిగా పౌర పఠన కేంద్రాలకు వెళ్ళి కావలసిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలోని వివిధ మండలాల్లోని 18 గ్రామపంచాయతీ, పౌర పఠనకేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటి వరకు 13 గ్రామాలలో ప్రారంభించుకున్నామని ఇంకా ఏదేని గ్రామపంచాయతి ఉచిత వసతి ఏర్పాటు చేసినట్లతే ఆయా గ్రామాలలో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా పౌర పఠనకేంద్రాల నిర్వహాకులు విధిగా పౌర పఠనకేంద్రాలను తెరచి ఉంచాలని విద్యార్థిని, విద్యార్థులకు కావలసిన పుస్తకాలను రిజిస్టారులో నమోదు చేయించి జిల్లా పౌర పఠనకేంద్రాల సంస్థకు తెలియజేయాలని ఆదేశించారు. పాఠకులకు గ్రామ పంచాయతి తరుపున మంచినీటి, మరుగుదొడ్ల ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ప్రత్యేక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడివో మహబూబ్ అలీ, పంచాయతి కార్యదర్శులు రాజు, బి.రాజు

## కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంటు,నీళ్ల కష్టాలు : మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్, మార్చి 4, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడవకముందే ప్రజలకు నీళ్ల,కరెంట్ కష్టాలు మొదలయ్యాయని మాజీ శాసన సభ్యులు వొడితల సతీష్‌కుమార్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 12న కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మొదటి పార్లమెంట్ ఎన్నికల సభ శంకారావానికి నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ నిర్వహించబోయో సభ కోసం వచ్చే మూడు రోజులు నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల వ్యాప్తంగా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకుని సభకు భారీ సంఖ్యలో హాజరుకాబోతున్నామన్నారు.ఇక రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెప్పపాటున కరెంట్ సరఫరా నిలిచేది కాదని,కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంట్ కోతలు పెడుతున్నారన్నారు. సాగు చేసుకునే రైతులు కరెంట్ విషయంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు.ఇది పంటలు చేతికి వచ్చే సమయం అని కావున కాంగ్రెస్ ప్రభుత్వం తమపై నమ్మకంతో ఓట్లువేసి గెలిపించిన ప్రజల పక్షాన నిలబడాలని,పంటలు చేతికి వచ్చే సమయంలో కరెంట్ కోతలు పెట్టకుండా రైతులను కాపాడాల న్నారు. ఇక హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చురకైన నాయకులని, నియోజకవర్గ రైతాంగం సమస్యల పరిష్కారానికి వారం రోజులు ప్రజలకు అందుబాటులో ఉండి ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఇక వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలి పించుకుని కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మెన్ సుధీర్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్, మండల అధ్యక్షులు వంగ వెంకటరామిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, అక్కన్నపేట మండల అధ్యక్షులు పెసరు సాంబ రాజు, రాష్ట్ర నాయకులు శ్రీహరి, కోహెడ మండల అధ్యక్షులు ఆవుల మహేందర్, మాజీ ఎంపిపి ఆకుల వెంకన్న, మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డితో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## సమయ పాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకోవాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేష్

**హుస్నాబాద్, మార్చి 4,ప్రభాతవార్త :**

హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సమయపాలన పాటించకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ ఆరోపించారు.సోమవారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని గోదాం గడ్డలో గల బస్తీ దావాఖానాలో వైద్యులు,సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రిని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వహించాల్సిన రావడం లేదని ప్రతీ రోజు విధులు నిర్వహించాల్సిన వైద్యులు అంతా సిండికేట్‌గా ఏర్పడి ఒక్కరోజు ఒకరే విధులు నిర్వహించుకుంటూ లక్షల జీతాలు దండుకుంటున్నారన్నారు.విధుల్లో ఉండే డాక్టర్లేమో చిన్న సమస్యతో వచ్చిన కనీసం రోగిని పరీక్షించకుండా వరంగల్,కరీంనగర్,సిద్ధిపేట ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని మండిపడ్డారు.నిద్రావస్థలో ఉన్న వైద్యులపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని,ఆసుపత్రులలో బయోమెట్రిక్,సిసి కెమోరాలు ఏర్పాటు చేయడంతో పాటు అకస్మిక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎగ్గోజు సుదర్శనచారి,అయిలేని మల్లారెడ్డి,ఎండి అక్బర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

## పాఠశాల క్రీడా మైదానంలో గ్రంథాలయాన్ని నిర్మించొద్దు

**వెల్దుర్తి, మార్చి4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో గ్రంథాలయ భవన నిర్మాణాన్ని చేపట్టవద్దని గ్రామస్థులు సోమవారం జిల్లా పరిషత్ సీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల క్రీడా ప్రాంగణంలో అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి అక్కడ నిర్మించ తలపెట్టిన గ్రంథాలయ భవనాన్ని వేరే చోటుకు తరలించాలన్నారు. పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆగస్టు 13, 2019న పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పటి ఎస్ఎంసీ తీర్మాణం లేకుండా అప్పటి పంచాయితీ కార్యదర్శి పద్మ నిబంధనలకు విరుద్ధంగా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ పేరున గిఫ్ట్ డీడ్ చేశారు. దశాబ్దాలుగా పాఠశాల ఆధీనంలో ఉన్న స్థలంలో లైబ్రరీ నిర్మించవద్దని, ఆ స్థలం విద్యార్థులకు క్రీడలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రరె వెంకటేశం, కృష్ణాగౌడ్, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రావణ్ కుమార్, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హనుమంతరావు



మాట్లాడుతున్న హనుమంతరావు

**రామాయంపేట, మార్చి 4, ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పట్టణంలోని వివేకానంద ఆవాస విద్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హన్మంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొని విద్యారంద, ఉపాధ్యాయ సమస్యలపైన చర్చించి పలు తీర్మానాలు చేయడం జరిగింది. వచ్చే విద్యాసంవత్సరము త్వరగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదీలీలు చేపట్టాలని, మండల విద్యాధికారుల ఖాళీలను భర్తీ చేయాలని ఈ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అర్హత గలవారికి గతంలో మాదిరిగా జూనియర్ లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్ పదోన్నతులు కల్పించే అవకాశాన్ని పునరిద్దరించాలని, రెండు దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోలేని పండిట్, పి.ఇ.టి. ల సమస్యను పరిష్కరించి పదోన్నతులు కల్పించాలని నిర్ణయించడం జరిగింది. నూతన పిఆర్‌సి కమిటి రిపోర్ట్ను సమయానికి పూర్తి చేసి ఫిట్మెంట్ ప్రకటించి, బాకీ పడ్డ మూడు డిఎలను విడుదల చేయాలని, ప్రభుత్వం వద్ద పెండింగులోఉన్న ఉపాధ్యాయుల వివిధ రకాల బిల్లులు 15 నెలల నుండి 24 నెలల వరకు ఉన్న బిల్లులను మంజూరి చేయాలని తపస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అదే విధంగా మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్స్, పెండింగ్ టిఎస్‌జిఎల్ఐ, సామాజిక భీమా ఫైనల్ బిల్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ భవిష్యనిధి జిపిఎఫ్, పార్ట్‌ఫైనల్, లోన్లు త్వరితగతిన మంజూరు చేయాలని, 2004 తర్వాత నియామకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సిపియస్ విధానంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేయడం జరిగింది. సమగ్ర శిక్షణలో పనిచేయుచున్న బోధన, భోదనేతర సిబ్బంది, కస్తూర్బా పాఠశాలలో పనిచేయుచున్న సిబ్బంది సమస్యలు పరిష్కారించాలని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, గురుకులాలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అనేక రకాల మేనేజ్మెంట్ల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తిచేసింది. విద్యారంగం బలోపేతంకావాలంటే నూతన జాతీయ విద్యా విధానం-2020 అమలు చేయాలని తపస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. సమావేశంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, అఖిల భారతీయ సైక్షనిక్ మహాసంఘ్ పాఠశాల వింగ్ ప్రతినిధి పాలేటి వెంటటరావు, సహ శైక్షిక్ ప్రముఖ్ డా. సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సహ అధ్యక్షులు ఎ.నరేందర్‌రావు, ఉషారాణి, అదనపు ప్రధాన కార్యదర్శిలు బండి రమేష్, పి. రామకృష్ణ రెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు జి.ఎల్లం, ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మన్, భాస్కర్, వెంకట్‌రామా రావు, రామాయంపేట అధ్యక్షులు మెట్టు శేఖర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు

**సిద్దిపేట రూరల్, మార్చి 4, ప్రభాతవార్త :** ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మనుచౌదరిని దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి పార్టీ నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి(అమర్) తదితరులు ఉన్నారు.

## భూపాల్‌రెడ్డికి బిఆర్‌ఎస్ ఎంపి టికెట్ కేటాయించాలి



మాజీ సిఎం కేసిఆర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, మార్చి 4, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డికి జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు బిఆర్‌ఎస్ అధిష్టానం అవకాశం కల్పించాలని బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సంజీవరావు పాటిల్ కోరాఉ. ఇటీవల ముగిసన శాసనసభ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీలోతో ఓటమి చెందారని, జహీరాబాద్ పార్లమెంట నియోజకవకర్గంలోని కామారెడ్డి జిల్లా జుక్కల, బాన్సువాడ, కామారెడ్డి నియోజకవర్గాల్లో భూపాల్‌రెడ్డికి మంచి పట్టు ఉందని, భూపాల్‌రెడ్డికి ఎంపి టికెట్ కేటాయిస్తే సునాయాసంగా విజయం సాధిస్తారని సంజీవరావు పాటిల్ సూచించారు.

## ఇంటర్ పరీక్షల్లో 10 మంది విద్యార్థుల డిబార్

**న్యాల్‌కల్, మార్చి 4, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో సోమవారం 10 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మహేష్ తెలిపారు. విద్యార్థుల పరీక్షా కేంద్రాన్ని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ స్పెషల్ స్క్వాడ్ తనిఖీ చేయడం పరీక్షలు రాస్తున్న 10 మంది విద్యార్థులు మాస్‌కాపీ చేస్తుండగా అధికారులు పట్టుకుని డిబార్ చేశారు.

## నేడు రామాయంపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం

### హాజరు కానున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 4, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ దేవేందర్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరమునకు గాను బడ్జెట్ సమావేశం కౌన్సిల్ అధ్యక్షతన నిర్వహించనున్నామన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు హజరవుతున్నారని తెలియజేశారు.

## విద్యార్థులకు తెలంగాణ ఓటరు సంకల్ప పత్రాల పంపిణీ



విద్యార్థులకు ఓటరు సంకల్ప పత్రాలను అందజేస్తున్న రాధాకిషన్

**కొల్చారం, మార్చి4 ప్రభాతవార్త:** రాబోయే లోక్‌సభఎన్నికల్లో పోలింగ్ శాతం జిల్లా వ్యాప్తంగా పెంచడమే లక్ష్యంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వారి తల్లిదండ్రులు కచ్చితంగా ఓటు వేసేలా తెలంగాణ ఓటరు సంకల్పపత్రాలను జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధాకిషన్ చేతుల మీదుగా అందజేసినట్లు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల జిల్లా వ్యాప్తంగా మెరుగైన పోలింగ్ శాతం నమోదైనందున, ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికలఅధికారి ఆదేశించినట్లు వారు తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా వారి తల్లిదండ్రులకు అందించి వారి సంతకంతో కూడిన పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

గ్రూప్ 1,2,3,4, ఎస్ఎస్‌సి,ఆర్ఆర్‌బి,బ్యాంకింగ్, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర రాష్ట్రస్థాయి, కేంద్రస్థాయి ఉద్యోగాలకు టిఎస్ఎస్ స్టడి సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సుద్వారా 5 నెలలపాటు ఉచిత శిక్షణ అందించడం జరుగు తుందని జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి కవిత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మార్చి 6 వరకు అన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు వచ్చిన మెరిట్ అధారంగా 75 శాతం ఎస్సీలకు, 15 శాతం బీసీలకు, 10 శాతం ఎస్టీలకు ఇందులో 33 శాతం మహిళలకు, 5 శాతం అంగవైకల్యం కలవారికి సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈనెల 18 నుంచి తరగతులు 5 నెలల పాటు నిర్వహించనున్నట్లు వివరించారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిఎస్ఎస్‌టియుడి వైసి ఐఆర్‌సిఎల్‌ఈ. కం.ఐన్‌లో అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ కుల, అదాయం, పదో తరగతి, డిగ్రీ, అధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



బేస్‌మెంట్ తొలగిస్తున్న అధికారులు

## ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

దుండిగల్, మార్చి 4 ప్రభాతవార్త: గండిమైసమ్మ-దుండిగల్ మండలం బహాదూర్‌పల్లి పరిధి సర్వేనంబర్ 227లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలను సోమవారం గిర్దావర్ భారతి ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. ఆక్రమణలకు పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్ఏలు పాల్గొన్నారు.

## సిఎం ఒఎస్డీకి అభినందనలు



సిఎం ఒఎస్‌డి అజిత్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు సంకి రవీందర్, ఏబేలు తదితరులు

కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు రా ష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.48 కోట్లు టీపిటీ బకాయిలను చెల్లించినందుకు ఎలివేటెడ్ కారిడార్ (స్కైవే)ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినందుకు సోమవారం సిఎం ఓఎస్‌డి అజిత్ రెడ్డిని కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం ఏబేలు, ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబులు కలిసి అభినందనలు తెలియజేశారు. అదే విధంగా కంటోన్మెంట్ బోర్డుపై పూర్తి అవగాహన కలిగి ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద మోడీకి ప్రతిపాదనలు పంపినట్లు అజిత్ రెడ్డి తెలిపారు. దీంతో సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చాలి

### క్యెప్టెన్ ఎస్.ఎన్.రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాల్లో బ్రిలియంట్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు

అద్దగుట్ట, మార్చి 4 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభకనబర్చాలని తెలంగాణ రాష్ట్ర ఎవియేషన్ అకాడమీ సిఈఓ,కార్యదర్శి క్యెప్టెన్ ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు. బోయిన్‌పల్లిలోని దిబ్రిలియంట్ టాలెంట్ స్కూల్ 26వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.కె. ఆర్.సతీష్, ప్రిని స్పాల్ ఎస్.మీనాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులకు మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, రాజ్‌గోపాల్, చంద్ర మౌళి, సంధ్యా రాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బెంగాలీల సమస్యల పరిష్కారం కోసం కృషి

### చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ



చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీకి మెమోంటోను ప్రధానం చేస్తున్న దృశ్యం

చార్మినార్, మార్చి 4 ప్రభాతవార్త : పాతబస్తీలోని బెంగాలీల సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల కృషి చేస్తానని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్‌అలీ అన్నారు. ఘాన్సీ బజార్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీని బెంగాలీలు సన్మానించి మెమోంటోను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్,ప్రతినిధులు,మందిర నస్కర్,దేబ్‌జీత్‌లు పాల్గొన్నారు.

## ఉత్సాంహవాగా సాగిన 'సోప్‌బాక్స్ రేస్'

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: ఫిల్మ్‌నగర్‌లోని రామానాయుడు స్టూడియోలో సోమవారం నిర్వహించిన" రెడ్‌బుల్ సోప్‌బాక్స్ రేస్ " ఉత్సాహంగా సాగింది. సృజనాత్మకత, వినోదం, గ్లామర్ కలగలిన ఈరేస్‌లో కామిక్స్,గేమర్స్, ఆర్టిస్టులు సందడి చేశారు. స్పెయిన్, ఇటలీ, యుకె, యుఎస్ఏ, ఫ్రాన్స్, జర్మని వంటి దేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈరేస్ ఈసారి హైదరాబాద్‌లో జరిగింది. గురత్వాకర్షణ శక్తితో నడిచే సోప్‌బాక్స్ వాహనాలను రూపొందించడంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు తమ చాతుర్యాన్ని, అభిరుచిని ప్రదర్శించాయి. ఈపోటీలకు దేశంలోని 23రాష్ట్రాలనుంచి 3300 రిజిస్ట్రేషన్లు వచ్చాయి. కాగా రెండురోజులపాటు జరిగిన ఈరేస్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రాకన్ వాగన్ అనే జట్టు గెలుపొందింది. అలాగే రెండోస్థానంలో ముంబై నుంచి వచ్చిన కిత్‌అండ్ కిన్ నిలవగా ..హైదరాబాద్‌కీ ఫేవరేట్ బిర్యానీకి సవారీ మూడో స్థానంలో నిలిచింది. దీనికి సినీప్రముఖులు రాణాదగ్గుపాటితోపాటు భారత మాజీ చెస్ క్రీడాకారిని తానియా సచ్‌దేవ్, హాకీ క్రీడాకారుడు మన్‌ప్రీత్‌సింగ్, లాల్ రెమ్ సిమియా హాజరయ్యారు.

## గ్రేవ్ యార్డు ఏర్పాటు ముస్లీంల కోరిక

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో గ్రేవ్ యార్డును సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న తలసాని

బేగంపేట మార్చి 4,ప్రభాతవార్త : బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో గ్రేవ్‌యార్డ్ ఏర్పాటు ఎన్నో సంవత్సరాల ముస్లీంల కోరిక అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని గ్రేవ్‌యార్డును తలసాని సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న భవనం,కాంపౌండ్ వాల్ నిర్మాణం,ఇతర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేవ్‌యార్డుకోసం సుమారు 2ఎకరాల భూమిని కేటాయించడమే కాకుండా,నిర్మాణం కోసం 2.95కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.గ్రేవ్ యార్డు స్థలంలో సుమారు 200లారీల వ్యర్థాలను తరలించి చదును చేస్తున్నట్లు చెప్పారు. పనులు మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్మక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి,డిసి సమ్మయ్య,ఈఈ సుదర్శన్,వాటర్‌వర్క్స్ జీఎం వినోద్,బీఆర్ఎస్‌నాయకులు శ్రీహరి,డివి.నరేందర్ రావు నాయి,శ్రీనివాస్,గౌడ్,ఆరీఫ్,వాహెద్ తదితరులు ఉన్నారు.

## మహాశివరాత్రికి ముస్తాబైన సంగమేశ్వరస్వామి దేవాలయం

నాంపల్లి, మార్చి 4 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ వారి ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వర స్వామి-శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 6 బుధవారం నుండి 9 శనివారం వరకు ఆలయ సంప్రదాయానుసారం మహాశివరాత్రి ఉత్సవాలు, పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగం జరిగేందుకు ముస్తాబైంది. ఈ ఉత్సవాల్లో నిత్యహోమంతోపాటు మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరుపబడతాయని ఆలయ కమిటీ పేర్కొన్నారు. 6 బుధవారం సాయంత్రం 5.30గంటల నుండి గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋుత్విగ్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, ధ్వజపటాధివాసం తదితర కార్యక్రమాలతో ప్రారంభమై 7 గురువారం ఉదయం 8.30ల నుండి యాగశాల ప్రవేశం, సోమకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాధిహోమం, ధ్వజారోహణం, రాత్రి 7గంటల నుండి భేరి పూజ, తాడనం, నిత్య హోమం, పూర్ణాహుతి, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద వితరణలు; 8 శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్న ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, 7.30 నుండి 9గంటల వరకు ఏకవార రుద్రాభిషేకములు జరుపబడతాయని వారు పేర్కొన్నారు.

## మహా శివరాత్రి సందర్భంగా రుద్రాక్షలు పంపిణీ



సమావేశంలో పాల్గొన్న మహాదేవ్ మందిరం కమిటి ప్రతినిధులు అజయ్ కుమార్ అగర్వాల్ తదితరులు

చార్మినార్, మార్చి 4 ప్రభాతవార్త : చార్ కమాన్‌లోని చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో మహా శివరాత్రి సందర్బంగా భక్తులకు రుద్రాక్షలు పంపిణీ చేయనున్నామని ఉత్సవాల కమిటి కన్వీనర్ అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.మహా శివరాత్రి మహోత్సవాలు సందర్బంగా ఏర్పాట్ల ను పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో ఈనెల 8వ తేదీన అత్యంత వైభవంగా మహా శివ రాత్రి ఉత్సవాలను నిర్వహించటానికి అన్నిఏర్పాట్లు చేశామని తెలిపారు.మహా శివరాత్రి మహోత్సవాలు రోజున అభిషేకాలు, పూజలు అనంతరం భక్తులకు రుద్రాక్షలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మందిరం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకుని ఎక్కువ కాలం జీవించాలని మానవ జన్మను సార్థకత చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హిమాయత్‌నగర్‌లోని దత్తానగర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందులో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బస్తీ దవాఖానాలో రోగులకు ఉచితంగా పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిహెచ్ఎంసి డిప్యూటి మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం కోసం నగర వ్యాప్తంగా బస్తీ దవ్వాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నిషియన్ల వేతనాలను పెంచాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ ల్యాబ్‌లలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్ల డిమాండ్లను పరిష్కరించాలని ల్యాడ్ టెక్నిషియన్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షులు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధిబృదం రెండవ వేతన సవరణ కమిషన్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వేతన సవరణల్లో ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్స్‌కు జరిగిన అన్యాయాలను పూర్తి స్థాయిలో విచారించి న్యాయం జరిగేలా చూడాలని కోరడం జరిగిందన్నారు. . ఈకార్యక్రమంలో కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షులు మహమ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి



హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఉద్యోగులు

నిజాంపేట్, మార్చి 4, ప్రభాతవార్త : ఆల్విన్ మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు, ప్రగతి నగర్ సీనియర్ సభ్యులు సోమవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అధిక నీటిబిల్లు గురించి, క్యాటరింగ్ వైస్‌గా ఉన్నదాని గురించి, ఆల్విన్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ స్థలం కొరకు ఎమ్మార్వోకి రాసిన లెటర్స్ అందజేశారు. హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హోదాలో వారి లెటర్‌హెడ్‌పై సిఫారస్ చేసి వాటర్ వర్క్స్ ఎండీని కలిసి మాట్లాడుతానని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హన్మంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహిస్తున్న వేణుగోపాలస్వామి

## లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం

### వేణుగోపాలస్వామి ధీమా

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సికింద్రాబాద్ లోక్‌సభ సీటు అశావాహ అభ్యర్థి వేణుగోపాలస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ మీదగా బషీర్‌బాగ్ వరకు వేణుగోపాల స్వామి 'భారత్ జోడో న్యాయ యాత్ర' చేపట్టి మాట్లాడారు. ఈ యాత్రలో ఆయన వెంట వందలాది మంది కా ంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, ప్రజలందరికి న్యాయం అనే సందేశంతోపాటు అణగారిన, దోపిడీకి గురవుతున్న వారికి న్యాయం కోసం రాహుల్‌గాంధీ యాత్ర చేపట్టారని చెప్పారు.

## కంటోన్మెంట్‌కు రూ.49 కోట్లు నిధులు విడుదల చేయడం అభినందనీయం



సిఎంచిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు వెన్నెల గద్దర్, ముప్పిడి గోపాల్, అమరేందర్ రెడ్డి

కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డుకు టీపిటీ బకాయిలను 49 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిని నందుకు సంతోషం వ్యక్తం చేసస్తూ కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వెన్నెల గద్దర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్, మర్రి అమరేందర్ రెడ్డిలు, సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

## ఓబిసి మోర్చా సామాజిక సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు కె.వెంకేష్,గౌరీ శంకర్ సోనీ

యాకుత్‌పుర, మార్చి 4 ప్రభాతవార్త : పాతబస్తీ దేవిబాగ్‌లో సోమవారం బిజెపి ఓబిసి మోర్చా గోల్కొండ జిల్లా కార్యదర్శి గౌరీ శంకర్ సోనీ ఆధ్వర్యంలో ఓబిసి మోర్చా సామాజిక సమ్మేళనం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఓబిసి కార్యదర్శి మోకాళ్ళ వెంకటేష్ మాట్లాడుతూ బిజెపి పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఐటి సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేష్, మోర్చా జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి నర్సింగరావు,ఉపాధ్యక్షులు కరణ్ జై,బిజెపి నాయకులు ప్రకాష్ గౌడ్‌తో పాటు సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్ పల్లి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ని కలిసిన న కార్పోరేటర్ ముద్దం



బంజారాహిల్స్‌లో మహిళా దిన్సోతవం సందర్భంగా అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి అశురెడ్డి, మోడల్స్

## పని ఒత్తిడితో ఈనాడు కాల్ సెంటర్ మహిళా ఉద్యోగిని ఆత్మహత్య



సాయికుమారి (ఫైల్ ఫోటో)

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4 ప్రభాతవార్త: పని ఒత్తిడి కారణంగా ఓ మహిళా ఉద్యోగి నాలుగు అంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్‌లో నివసించే ఎర్రగుల్ల శ్రీనివాస్‌కు సాయి కుమారితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయికుమారి 9 సంవత్సరాలుగా రామోజీఫిలిం సిటీలోని ఈనాడు సంస్థలో కాల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తుంది. భర్త శ్రీనివాస్ కూడా ఫిలిం సిటీలోనే విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయికుమారికి ఉదయం షిఫ్ట్ ఉండడంతో ఆరు గంటలకు ఫిలిం సిటీ బస్సులో విధులకు హాజరయ్యింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈనాడు హెచ్‌ఆర్ కార్యాలయంనుంచి భర్త శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. మీ భార్య సాయికుమారి ఈనాడు బిల్డింగ్‌లోని నాలుగవ అంతస్తునుంచి కింద పడి పోయిందని తెలుపడంతో హుటాహుటిన శ్రీనివాస్ రామోజీ ఫిలిం సిటీలోని ఈనాడు బిల్డింగ్ వద్దకు వెళ్లి చూడగా తన భార్య అప్పటికే రక్తం మడుగులో పడి ఉండడం గమనించాడు. కార్యాలయంలో పని ఒత్తిడి తీవ్రంగా ఉందని తీవ్ర ఒత్తిడి గురవుతున్నానని భర్త శ్రీనివాస్‌కు చెప్పటంతో ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని ధైర్యంగా ఉండాలని చెప్పడంతో ఆదివారం శ్రీనివాస్ తన భార్య కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లి రావడం జరిగిందని అన్నారు. భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## కూతురితో వివాహిత అదృశ్యం

యూసుఫ్‌గూడ, మార్చి 4, ప్రభాతవార్త : వివాహిత కూతురితో కలిసి అదృశ్యమైన సంఘటన బోరబండ పిఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సునీల్ నగర్‌కు చెందిన ఎం.రమేష్, శిరీష భార్యాభర్తలు, మధురిమ, వందన ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలకు కొన్నేళ్ళుగా గొడవలు జరుగుతున్నాయి. పనిమీద బయటికి వెళ్ళిన భర్త తిరిగొచ్చి చూడగా ఇంట్లో భార్యతో పాటు చిన్న కూతురు వందన కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 8 నుంచి మహా శివరాత్రి వేడుకలు

యూసుఫ్‌గూడ, మార్చి 4, ప్రభాతవార్త : మోతీనగర్ శ్రీ శృంగేరి శారద శంకర మఠంలో మహా శివరాత్రి వేడుకలు ఈనెల 8వ తేది శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి తెలిపారు.శుక్రవారం ఉదయమే శ్రీచంద్రమౌళీశ్వర స్వామి వారికి విశేష అభిషేక అర్చనలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సాయంత్రం 5:30 నిమిషాల నుండి 7:30 నిమిషాల వరకు మహాన్యాస పూర్వక ప్రదోషకాల ఏకవార అభిషేకము, రాత్రి 8:30నిమిషాల నుండి 10గంటల వరకు శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణం, రాత్రి 10:30 నిమిషాల నుండి 12:30నిమిషాల వరకు శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి లింగోద్భవ అభిషేకములు, ఈనెల 9వ తేది శనివారం ఉదయం 8:00గంటలకు శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి భస్మాలంకారము, ఉదయం 9:30నిమిషాలకు మహామృత్యుంజయ సంపుటిత రుద్రహోమం, పూర్ణాహుతి అనంతరం మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిపేందుకు ఇప్పటికే శంకర మఠంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్



ధర్నాచౌక్, మార్చి 4, ప్రభాతవార్త: గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ఐదు వందల కోట్ల బడ్జెట్‌తో గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు తక్షణమే ఏర్పాటుచేయాలని బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ సచ్చుడో గల్ఫ్ సంక్షేమం బోర్డు తెచ్చుడో అనే నినాదంతో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్య అతిధిగా హాజరై లక్ష్మణ్ మాట్లాడుతూ మన రాష్ట్రం నుండి అనేక మంది ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారని, గత తొమ్మిది సంవత్సరాలలో దాదాపు రెండు వేల మంది కార్మికులు చనిపోవటంతో వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబానికి ఐదు నుండి పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అక్కడ చనిపోయిన కార్మికుల డెడ్‌బాడీ రెండు రోజుల్లో ఇక్కడ ఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో బీఎంఎం రాష్ట్ర అధ్యక్షులు ఒలిగి ప్రభాకర్, బీఎంపీ నాయకులు ప్రొఫెసర్ ధర్మయ్య, గుర్రం పల్లి శ్యాంరాజ్, ఉప్పులేటి రాజేందర్, మేకల దాస్, కే.పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగాత్మకత ఉట్టిపడేలా శ్రీ గౌతమి సైన్స్‌ఫెయిర్ 2024

కుత్బుల్లాపూర్, మార్చి 4 ప్రభాతవార్త: విద్యార్థులకు విద్య, శారీరక దారుఢ్యంతో పాటు మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహణ అవసరమని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ శివరాత్రి యాదగిరి అన్నారు. మాజీ ఎయిర్‌ఫోర్స్ విభాగం రిటైర్డ్ అధికారి రవిరాజుతో కలిసి ఆయన గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని శ్రీ గౌతమి పాఠశాలలో సోమవారం విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన శ్రీ గౌతమి సైన్స్‌ఫెయిర్ 2024 కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలోకి రాకెట్లను పంపిస్తున్న భారతదేశం స్వయంప్రతిపత్తితో ప్రపంచంలోనే అగ్రగామిగా మారేదిశగా అడుగులు వేస్తుందన్నారు. విద్యార్థులు రూపొందించిన రిమోట్‌సెన్సింగ్ వాహనాల నిర్వాహణను చూసి ఆయన అబ్బురపోయారు. భవిషత్‌లో మరిన్ని విజయాలదిశగా శ్రీ గౌతమి పాఠశాల విద్యార్థులు తమసత్తాచాటాలని సూచించారు. పాఠశాల నిర్వాహకులు రవిరాజు మాట్లాడుతూ ప్రతివిద్యార్థిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పంచశీల శ్రీనివాస్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 15 నుంచి17 వరకు హైలైఫ్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 15,16,17 తేదీల్లో హెచ్ఐసిసి నోవాటెల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలో సినీనటులు అషురెడ్డి, ప్రీతి కుమారి, ప్రియాంక చౌదరి తదితరుల హాజరై ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో స్ప్రింగ్ సమ్మర్ స్పెషల్‌ని ప్రదర్శిస్తుందన్నారు. బ్రైటర్ హ్యూస్, లైఫ్‌స్టైల్‌వేర్, బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్ వంటి యాక్సెరీలు, అభరణాలు ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఛత్రపతి విగ్రహా ఏర్పాటుకు సహకరిస్తా

### కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ



కౌన్సిలర్ క్రిష్ణతో దుండిగల్ వాసులు

దుండిగల్, మార్చి 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌కు చెందిన పలువురు నాయకులు సోమవారం బిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని వినతి పత్రం ద్వారా ఆయన్ని కోరారు. స్పందించిన క్రిష్ణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం నాకల అన్నారు. కమిటి ముందుకు రావడం..నాకల సాకారం అవుతున్నందుకు సంతోషంగా ఉందని విగ్రహ ఏర్పాటులో భాగస్వామిని అవుతానని పేర్కొన్నారు.

**వైభవంగా మహాపడిపూజ..** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి నాగులూర్‌లో సోమవారం గురుస్వామి భిక్షపతి ఆధ్వర్యంలో శివస్వాముల 14వ వార్షికోత్సవం, లక్షబిల్వార్చన, శివ ధీపారాధన వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఈవేడుకల్లో కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నల్తూరి క్రిష్ణ, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, విష్ణు, బండారి మహేష్, భాను, రవి, శ్రీశైలం కమిటి సభ్యులు భానుగౌడ్, విజయ్‌సాయి, శ్రీకాంత్, రాజ్‌కుమార్, నాగరాజుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు నియమ నిబంధనలు పాటించాలి

## సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్


మాట్లాడుతున్న రూపేష్

**పటాన్‌చెరు, మార్చి 4,ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంగారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పటాన్‌చెరు, అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరధిలో ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు. ఈ నెల 5వ తేదిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంగారెడ్డి జిల్లాలో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్న సందర్భంగా పటాన్‌చెరు ఎల్లంకి కళాశాలలో ఎస్పీ రూపేష్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. పీఎం బహిరంగ సభా స్థలానికి చేరుకునే వాహనదారులు నిబంధనలు, ఆంక్షలు పాటించవలసి ఉంటుందన్నారు. బస్సులలో మీటింగ్ స్థలికి వచ్చే వారు కామారెడ్డి, రామాయంపేట, తూప్రాన్ వైపు నుండి వచ్చే బస్సులు కండ్లకోయ వద్ద, గజ్వేల్ వైపు నుండి మీటింగ్‌కు వచ్చే బస్సులు షామీర్ పేట వద్ద, మెదక్, నర్సాపూర్ వైపు నుండి వచ్చే బస్సులు గుండ్ల పోచమ్మ వద్ద, సంగారెడ్డి, జహిరాబాద్, జోగిపేట వైపు నుండి వచ్చే బస్సులు ముత్తంగి ఎగ్జిట్ నంబర్–3వద్ద, హత్నూర, దౌల్తాబాద్ వైపు నుండి మీటింగ్‌కు వచ్చే బస్సులు ముత్తంగి ఎగ్జిట్ నెంబర్3 వద్ద, హైదరబాద్, లింగంపల్లి మీదుగా మిటింగ్‌కు వచ్చే బస్సులు ముత్తంగి(ఔటర్ రింగ్‌రోడ్డు) ఎక్కి సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ నెంబర్–4 వద్ద దిగి, కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలికి చేరుకోవాలని తెలిపారు. కామారెడ్డి,రామాయంపేట, తూప్రాన్ నుండి కార్లలో మీటింగ్‌కు వచ్చేవారు కండ్లకోయ వద్ద, సిద్దిపేట,గజ్వేల్ వైపు నుండి కార్లలలో మీటింగ్‌కు వచ్చే వారు షామీర్ పెట వద్ద, మెదక్ నర్సాపూర్ వైపు నుండి కార్లలో మీటింగ్ వచ్చేవారు గుండ్ల పోచమ్మ వద్ద ( ఔటర్ రింగ్‌రోడ్డు)ఎక్కి ముత్తంగి ఎగ్జిట్ నెంబర్ –3 వద్ద దిగి ఎడమ చేతి వైపు సర్వీస్ రోడ్డు ద్వారా రామేశ్వరం బండ వద్ద గల పార్కింగ్‌స్థలికి చేరుకోవాలన్నారు. సంగారెడ్డి, జోగిపేట, వైపు నుండి కార్లలో మీటింగ్‌లకు వచ్చేవారు ముత్తంగి ఎగ్జిట్ నెంబర్–3, ఎగ్జిట్ నెంబర్ –3 వద్ద దిగి ఎడమ చేతి వైపు సర్వీస్ రోడ్డు ద్వారా రామేశ్వరం బండ వద్ద గల పార్కింగ్‌స్థలికి చేరుకోవాలన్నారు. హత్నూర,దౌల్తాబాద్ వైపు నుండి కార్లలో వచ్చేవారు (ఔటర్ రింగ్‌రోడ్డు) ఎడమ చేతివైపు సర్వీస్ రోడ్డు ద్వారా రామేశ్వరం బండ వద్ద గల పార్కింగ్ ప్లేస్‌కు చేరుకోవాలన్నారు. మీటింగ్‌కు వచ్చే బస్సులుతప్ప మరే ఇతర వాహనాలు సుల్తాన్ పూర్ ఎగ్జిట్ గెట్ నెంబర్–4 నుండి (ఔటర్ రింగ్ రోడ్డు) ఎక్కరాదన్నారు. పోచారం కమాన్ నుండి ముత్తంగి(ఔటర్ రింగ్ రోడ్డు) కుడి చేతి వైపు సర్వీస్ రోడ్డులో ఎలాంటి వాహనాలు నిలుపరాదన్నారు. జీఎంఆర్ ఫంక్షన్‌హాల్ నుండి ఏపిఆర్ రోడ్డు ద్వారా పటేల్ గుడకు వెళ్లే మార్గంలో ఎలాంటి వాహనాలు రావద్దని, పటాన్ చెరు నుండి ఇంద్రేశం వెళ్లేవారు ముతనంగి హరి దోషా వద్ద యుటర్న్ తిసుకొని ఔటర్ రింగ్ రోడ్డు ఎడమ చేతి వైపు సర్వీస్ రోడ్డు ద్వారా ఇంద్రేశం వెళ్లవలసి ఉంటుందని అన్నారు. ఇంద్రేశం గ్రామం నుండి పటాన్ చెరు వెళ్లే వారు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద రైట్ టర్న్ తిసుకొని సర్వీస్ రోడ్డు గుండా వెళ్లే ఎన్‌హెచ్–65 ద్వారా పటాన్‌చెరు వెల్లవలసి ఉంటుందని అన్నారు. మంగళవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ నిబంధనలు అమలులలో ఉంటాయని అన్నారు. సభా స్థలికి ఐదు కిలోమిటర్ల మేరకు యాంటి డ్రోన్ నిబంధన ఉంటుందన్నారు. మూడంచేల భద్రత చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. స్కూల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. సభా స్థలికి వచ్చేవారు కేవలం మొబైల్స్ ఫోన్స్ మాత్రమే అనుమతిస్తామని, క్యూఆర్‌ఆర్ కోడ్ ద్వారా రూట్ మ్యాప్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు, పటాన్‌చెరు డిఎస్పీ రవిందర్‌రెడ్డి, సిఐ ప్రవీణ్‌రెడ్డి, తదితరులున్నారు.


రాజీవ్ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

## సాగునీరు అందించాలంటూ రైతుల ఆందోళన

**సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), మార్చి 4, ప్రభాతవార్త :** సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని..సాగునీరు విడుదలచేసి ఆదుకోవాలని కోరుతూ సోమవారం చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలోని రాజీవ్ రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని మాచాపూర్, ఎల్లాయిపల్లి గ్రామాల రైతులు రంగనాయసాగర్ ఎడమ కాల్వ ద్వారా మాచాపూర్ నుంచి మేడిపల్లి వరకు వెళ్తున్న కాల్వకు మాచాపూర్ వద్ద శాశ్వత ఓటి(తూం) ఏర్పాటు చేసి లేదా కాలువలు తవ్వి సాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని రైతులు కోరారు. నాలుగేళ్లుగా యాసంగిలో పంటలు కాపాడాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. సాగునీరు అందించకుంటే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. విషయం తెలుసుకున్న డీఈ రాజమల్లు, పోలీసులు అక్కడికి చేరుకొని పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటాని నచ్చజెప్పి అందోళన విరమింపచేశారు. రైతుల అందోళనలతో భారీగా వాహనాలు రాజీవ్ రహదారిపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

## పంట పొలాల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త, వ్యవసాయ అధికారులు

**తొగుట, మార్చి 4, ప్రభాతవార్త :** మండలపరిధిలోని లింగపేటలో వరి, కీర పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారి మోహన్ సోమవారం సందర్శించారు. వరి పొలంలో మొగి పురుగు ఉధృతి, సూల్ఫిడ్ ఇంజురీ,నాచు గమనించారు. మొగి పురుగు నివారణకు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సుల్ఫిడ్ ఇంజురి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాచు నివారణకు సైతం చర్యలు తీసుకోవాలని నివారణ చర్యలను వివరించారు. బంతి పంటతో పంట మార్పిడి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు గొడుగు యాదగిరి, విస్తరణ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


జగదేవ్‌పూర్‌లో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి బాలేషంగౌడ్, జెడ్‌పిటిసి సుధాకర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సేవాకేంద్రానికి చేరుకొని తమ వివరాలను సరిచేసుకొని పథకాలను పొందాలన్నారు. సేవా కేంద్రానికి వచ్చే వారు ప్రజా పాలన దరఖాస్తు స్లిప్పులు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంటు బిల్లు జిరాక్సు ప్రతులను వెంట తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, ఎంపిటిసిలు కవిత శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, స్రవంతి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు భానుప్రకాష్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బుద్ద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం


సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న తిరుమల్‌రెడ్డి

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):** క్షేత్ర స్థాయిలో గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తాజా మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాములపర్తిలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.25 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, నాయకులు క్రాంతి కుమార్, లక్ష్మణ్, సుధాకర్‌గౌడ్, రాజయ్య, కిషన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలి : ఏఓ

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):** ప్రస్తుతం కూలీల కొరత ఉన్నందున రైతులు వరి పొలాల్లో డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేయవచ్చని మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొండపోచమ్మ రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో వరి పొలాల్లో మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ వారు అందించిన ఈ డ్రోన్‌ను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ డ్రోన్ ద్వారా పిచికారికి అవసరమయ్యే నీరు, వాతావరణ కాలుష్యం, రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. అనంతరం ఇఫ్కో సంస్థ సిద్దిపేట జిల్లా అధికారి చంద్రబాబు మాట్లాడుతూ రైతులు నానో యూరియాను వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణాధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.


డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగేందర్‌రెడ్డి


అనంతసాగర్‌లో స్వయం పరిపాలన జరుపుకున్న విద్యార్థులు

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**జగదేవ్‌పూర్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఒక్కరోజు ఉపాధ్యాయులుగా ఉన్నందుకు తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలని ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. డీఈఓగా భరత్, ఎంఈఓగా మీన, ప్రధానోపాధ్యాయులుగా విఘ్నేత, ఉపాధ్యాయులుగా శ్రీజ, నాగశ్వేత, హద్దు, సజ్జన్, మనోహర్, లిఖిత, అక్షర, భాగ్యలక్ష్మిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

**హత్నూర,మార్చి 4,ప్రభాతవార్త:** హత్నూర మండలం దౌలాపూర్ గ్రామం పరిధిలోని ప్రభుత్వ భూమిఇ ఆక్రమించి వెంచర్‌ను ఏర్పాటు చేసిన యజమాన్యం నుండి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని హత్నూర జడ్పీటీసీ ఆంజనేయులు సబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన హత్నూర మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

## ఉచిత విద్యుత్ బిల్లులు అందజేత

**నర్సాపూర్‌రూరల్,మార్చి 4,ప్రభాతవార్త:** మండల పరిధి రెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్ వినియోగదారులకు జిరో బిల్లులను సోమవారం నాడు మండల ఓబిసెల్ అధ్యక్షుడు అశోక్ గౌడ్ అందించారు. ఆయన మాట్లాడుతూ గృహ అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిరో బిల్లుతో ప్రతి కుటుంబానికి ఉచిత విద్యుత్ అందుతుందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు పర్చడం సంతోషకరమన్నారు. అంతే కాకుండా 6 గ్యారెంటీల అమలు దిశగా ప్రభుత్వం ముందుకు పోవడం గర్వకారణమన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడం, ఆరోగ్యశ్రీ సేవలు అందించడం, 500లకే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు.

## పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేయాలి

**హుస్నాబాద్, మార్చి 4, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూంల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్,నాయకులు అయిలేని మల్లిఖార్జునరెడ్డిలు డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ విషయంపై ధర్నా నిర్వహించారు.అనంతరం రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన నిర్మాణాలు అర్హులైన నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు.ప్రస్తుతం అధికారంలోకి విచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ పనులను పూర్తి చేసి పేద ప్రజల సొంతింటి కళను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, సారయ్య, పద్మ,ప్రియా,శారధ,కవిత,మంజులాతో పాటు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు


చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వాల సుప్రజనవీన్‌రావు

## పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత: కౌన్సిలర్ సుప్రజ

**హుస్నాబాద్, మార్చి 4, ప్రభాతవార్త :** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ వాల సుప్రజనవీన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని 20వ వార్డులో వార్డు ప్రజలకు తడి,పొడి చెత్తబుట్టలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పంపినీ చేసిన ఇండ్లలో మహిళలు పంపిణీ చేసిన బుట్టల్లో తడి,పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మమత, పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

### గౌడ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

**హుస్నాబాద్, మార్చి 4, ప్రభాతవార్త :** ఈనెల 10వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్న గౌడల ఆత్మీయ సమ్మేళనానికి హుస్నాబాద్ నియోజకవర్గం నుండి గౌడన్నలు పెద్ద ఎత్తున పాల్గొని వియవంతం చేయాలని ఆ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని ఎల్లమ్మతల్లిని సంఘం నాయకులతో కలిసి దర్శించుకున్నారు.అనంతరం ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం హుస్నాబాద్ అధ్యక్షులు పూదరి వరప్రసాద్‌గౌడ్, మాచెర్ల ప్రసాద్‌గౌడ్,సంఘం కోశాధికారి పొన్నం శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, రాజయ్య, కొమురయ్య, కుమార్,బొమ్మగాని హరిబాబు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను సత్కరించిన బిఆర్ఎస్ నాయకులు

**బెజ్జంకి, మార్చి 4, ప్రభాతవార్త :** తహశీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డిని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి, ఎంపిటిసి దుంబాల రాజమహేందర్‌రెడ్డి, లింగారెడ్డి సోమవారం కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐ మధుకర్‌రెడ్డికి సన్మానం

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):** మర్కుక్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మధుకర్‌రెడ్డిని బిఆర్ఎస్ జిల్లా యూత్ నాయకులు పాములపర్తి కరుణాకర్, నాయకులు పెద్దబోయిని కరుణాకర్, మేకల శ్రీను, కొట్టాల శ్రీనులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.

## ఉచిత మగ్గం వర్క్ శిక్షణ

**జగదేవ్‌పూర్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో సోమవారం నాబార్డు సహకారంతో ఐఆర్‌డిఎస్ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐఆర్‌డిఎస్ స్వచ్చంద సంస్థ డైరెక్టర్ రాజలింగం మాట్లాడుతూ 30 మంది మహిళలకు 20 రోజుల పాటు మగ్గం వర్క్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణలో భాగంగా మహిళలకు మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణా కాలంలో రూ.వెయ్యి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపిఎం ఆనంద్, సిసి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిన సుగుణమ్మ అనారోగ్యం కారణంగా మరణించింది. విషయం తెలుసుకున్న ఎంపిపి పాండుగౌడ్ మృతురాలి కుటుంబాన్ని సోమవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు నాయకులు జుట్టు సుధాకర్, పెద్దబోయిని ఎల్లం, రాములు, రమేష్ తదితరులు ఉన్నారు.

# సమావేశానికి రాని అధికారులకు నోటిసులను జారీ చేయండి

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**హత్నూర,మార్చి 4,ప్రభాతవార్త:**

మండల సమావేశాలకు హజరుకాని అధికారులకు నోటిసులను జారీ చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అదికారులను ఆదేశించారు. సోమవారం నాడు హత్నూర మండల సమావేశానికి హజరైన ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి పలు శాఖల అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు రాకుంటే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు హజరు తగినంత లేనందున సమావేశం వాయిదా వేయాల్సిందిగా ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సరిగ్గా హజరు కాకపోవడం పట్ల ఎంపివోను ప్రశ్నించారు. సమయపాలన పాటించాలని, వచ్చే సమావేశంలో మండలస్థాయి అధికారుల తో పాటు, డివిజన్ స్థాయి అధికారులు కూడ హజరయ్యేలా చూడాలని ఎంపిడీవో శంకర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ప్రతి సమావేశానికి హజరవుతానని, ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగితే ఊరుకునేది లేదని, ఆమె స్పష్టం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘించే వారు ఇక్కడ అవసరం లేదని, వేరే చోటుకు వెళ్లిపోవచ్చని సూచించారు. రైతు బంధు డబ్బులు రైతులకు ఇవ్వకుండా కొన్ని బ్యాంకు అధికారులు ఆ ఖాతాలను హోల్డ్‌లో పెడుతున్నారని అన్నారు. సమావేశానికి హజరుకాని అధికారుల జాబితాను కలెక్టర్‌కు పంపుతామని ఎంపిడీవో శంకర్ అన్నారు. మంగాపూర్‌లో డబుల్ బెడ్ రూం జాబితాలో పేరు వచ్చిన, ఇండ్లు రాని వారికి స్థలం కేటాయించాలని ఎంపీటీసీ విరేశం కోరారు. రెవెన్యూ సదస్సులు పరిష్కరించడంలో అధికారులు తగినంత శ్రద్ధ చూపించడం లేదని ఎంపీటీసీ వెంకటయ్య ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంపీపీ నర్సింలు, జడ్పీటీసీ ఆంజనేయులు, తహసీల్దార్ ఫర్హీన్, ఎంపిడివో శంకర్ తదితరులు పాల్గొన్నారు.


రామరాజును సన్మానించి తలంబ్రాలు (వడ్లు)ను అందజేస్తున్న దృశ్యం

## కోటి తలంబ్రాల దీక్షలో రామకోటి సంస్థకు చోటు

### -భద్రాచల దేవస్థాన ఏఈఓ శ్రావణ్‌కుమార్

**గజ్వేల్ టౌన్, మార్చి 4 (ప్రభాతవార్త):** భద్రాచల పుణ్యక్షేత్రంలో సీతారాముల కళ్యాణానికి గోటితోవొలిచిన తలంబ్రాలు మాత్రమే ఉపయోగిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ధార్మిక సంస్థలను ఎంపిక చేయగా ఇందులో రామకోటి సంస్థ ఉండడం విశేషం. తలంబ్రాలు గోటితో వొలిపించి తిరిగి దేవస్థానానికి అందించే అద్భుత అవకాశాన్ని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజంకు మళ్ళీ అవకాశం దక్కింది. గత 25 సంవత్సరాల నుండి నిర్విరామంగా రామ నామమే ప్రాణంగా రామకోటి రాయిస్తున్న ఆధ్యాత్మిక కృషి,పట్టుదలను భద్రాచల దేవస్థానం గుర్తించి కోటి తలంబ్రాల దీక్షలో స్థానం కల్పించింది. సోమవారం 150 కిలోల గోటి తలంబ్రాలకు ప్రత్యేక పూజలు జరిపి భద్రాచల దేవస్థాన ఏఈఓ శ్రావణ్‌కుమార్ శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజును దేవస్థానంలో శాలువాతో ఘనంగా సన్మానించి గోటి తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈఓ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం రామకోటి సంస్థకు 20 కిలోల వడ్లను ఇచ్చామని వేలాది భక్తులచే గ్రామ గ్రామాన తిరిగి గోటితో వొలిపించి తిరిగి కళ్యాణానికి అందించారని, ఈ సంవత్సరం ఏకంగా 150 కిలోల గోటి తలంబ్రాలను (వడ్లను) అందించామని తెలిపారు. ఏ సంస్థకు ఇంత పెద్ద అవకాశాన్ని ఇవ్వలేదని కేవలం రామకోటి సంస్థకు మాత్రమే ఇచ్చామని తెలిపారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

**కొమురవెల్లి, మార్చి 4, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనగామ ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి సోమవారం పరీక్షా ప్యాడ్స్ జామెంట్రీ బాక్స్, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు బాగా రాసి మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి అదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు హెచ్ఎం, ఉపాధ్యాయులు తలారి కీర్తనకిషన్, సిల్వేరి సిద్దప్ప, రమేష్, సార్ల కిష్టయ్య, స్వాములపల్లి కనకచారి,గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నరసింహులు, పోతుగంటి కొమురవెల్లి, సిలివేరి కనకయ్యమల్లేశం, సార్ల సురేష్, మంకాల సతీష్ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఏపిఎం అనంద్


మాట్లాడుతున్న ఏపిఎం అనంద్

**కొండపాక, మార్చి 4, ప్రభాతవార్త :** మహిళలు అర్థికంగా ఎదిగినపుడే కుటుంబాలు అభివృద్ధిలోకి వస్తాయని ఎపిఎం అనంద్ అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్‌లో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అయన సూచించారు. నాబార్డు సహకరంతో ఐఆర్‌డిఎస్ స్వచ్చంద సంస్థ అధ్వర్యంలో మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయిటింగ్ పై ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళ సంఘాల సభ్యులు 30 మందికి 20 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణలో భాగంగా పని నేర్చుకునే వారికి మధ్యాహ్న బోజనంతో పాటు రూ॥ వేయ్య స్టయిపండ్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని అర్థికంగా అదనపు అదాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రవి, ఐఆర్‌డిఎస్ సంస్థ డైరెక్టర్ రాజలింగం, విఓఎ మంగ తదితరులు పాల్గొన్నారు.


గాగిళ్లాపూర్‌లో ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులుల

## ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**బెజ్జంకి/కొహెడ, మార్చి 4, ప్రభాతవార్త :** కోహెడ మండల పరిధిలోని తంగళ్లపల్లి శివారులో ఒక వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సివిల్ పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అలాగే బెజ్జంకి మండల పరిధిలోని గాగిళ్లాపూర్ గ్రామ శివారులో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

## మద్యం తాగి ఆటో నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

పాపన్నపేట, మార్చి 4, ప్రభాతవార్త: మద్యం సేవించి ఆటో తోలిన వ్యక్తికి ఓ రోజు జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం...గత అయిదు రోజుల క్రితం మండల కేంద్రమైన పాపన్నపేటలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన సతీస్ మధనయం సేవించి ఆటోన నడుపుతూ పోలీసులకు చిక్కాడన్నారు. కేసు నమోదు చేసి మొబైల్ కోర్టుకు పంపగా న్యాయమూర్తి వాహన చోదకుడికి ఒక రోజు జైలు శిక్షతో పాటు 1000 వేయి రూపాయల జరిమానాను విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్సై నరేష్ వివరించారు.

## కమలాయపల్లిలో ఇసుక సీజ్

**చేర్యాల, మార్చి 4, ప్రభాతవార్త :** చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామ శివారులో అక్రమంగా డంపు చేసి ఉన్న ఇసుకను చేర్యాల రెవెన్యూ అధికారులు, మద్దూరు పోలీసులు సీజ్ చేశారు. సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు చేర్యాల ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, మద్దూరు ఎస్సై యూనస్ అహ్మద్ అలి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా రేషన్ బియ్యం, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఇసుక డంపును చూపిస్తున్న చేర్యాల ఆర్ఐ, మద్దూరు ఎస్సై



ఖాజాపూర్‌లో ధరణి ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఉమాశంకర్

## గ్రామాల్లో ధరణి ప్రత్యేక డ్రైవ్

**సిర్గాపూర్, మార్చి 4, ప్రభాతవార్త:** ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఉమా శంకర్ సూచించారు. సోమవారం మండలంలోని ఖాజాపూర్, గోసాయిపల్లి గ్రామాల్లో ధరణి గ్రామ సభలు నిర్వహించి రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. రైతులు రెవిన్యూ రికార్డుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ధరణి సమ్యలను ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఉమశంకరన పేర్కొన్నారు సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమాశంకర్, అధికారి నారాయణలు తెలిపారు.

## ధరణి సమస్యలు పరిశీలించిన తహసీల్దార్



పోతిరెడ్డిపల్లిలో ధరణి సమస్యలను పరిశీలిస్తున్న తహసీల్దార్

**సంగారెడ్డి, టౌన్, మార్చి 4, ప్రభాతవార్త:** ధరణి సమస్యల పరిష్కారానికి ధరఖాస్తు చేసుకున్న వారి సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలమేరకు తహసీల్దార్ దేవిదాస్ సిబ్బందితో కలిసి పోతి రెడ్డిపల్లిలోపరిశీలించారు. దరఖాస్తు చేసుకున్నవారి సమస్యలను పరిశీలించారు.

## కాంగ్రెస్‌లో చేరేదిలేదు : ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు సరికాదని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఖండించారు. జహీరాబాద్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం బిఆర్‌ఎస్‌లోనే ఆరంభం అయిందన్నారు. 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓడినా 2019, 2023లో తిరిగి పార్టీ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. జహీరాబాద్ నియోజకవర్గాభివృద్ధికి మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావులు తమ వంతు సహకరించారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, తన చివరి రక్తం బొట్టు వరకు బిఆర్‌ఎస్‌లోనే ఉంటానని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తేల్చి చెప్పారు.

## అయోధ్యకు తరలుతున్న బిజెపి శ్రేణులు



అయోధ్యకు తరలుతున్న బిజెపి శ్రేణులు

**మనూర్, మార్చి 4, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలతో పాటు నాగల్‌గిద్ద మండలంలోని గ్రామాల నుంచి శ్రీరామ భక్తులు సోమవారం అయోధ్యకు తరలివెళ్లారు. శ్రీరాముడిని స్మరిస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు రజనీకాంత్, సాయిరాం, సుధాకర్‌లు తరలివెళ్లారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపిటిసి విఠల్‌రెడ్డి

**అల్లాదుర్గం, మార్చి 4, ప్రభాతవార్త:** మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎంపిటిసి సభ్యులు విఠల్‌రెడ్డి డాక్టర్ శ్రీకాంత్‌తో కలిసి చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత మండలంగా తీర్చిదుద్దుకునేందుకు ప్రతి ఒక్కరు ఎవరికి వారు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మారుతినగర్ కాలనీని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



మారుతినగర్ కాలనీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సాపూర్, మార్చి 4, ప్రభాతవార్త:** నర్సాపూర్ పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డులో నూతనంగా మారుతినగర్ కాలనీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కాలనీకి మారుతి నగర్ అని నామకరణం చేసి స్వాగతం బోర్డును ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చేతుల మీదుగా స్వాగతం బోర్డుకు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మారుతినగర్ కాలనీని నూతనంగా ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మున్సిఫల్ కౌన్సిలర్ పంబళ్ళ రాంచందర్, నాయకులు వంటెద్దు బాల్‌రెడ్డి, కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, పంబళ్ళ బిక్షపతి, పురపాలక మేనేజర్ మధుసూధన్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**పాపన్నపేట, మార్చి 4, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజి అన్నారు. సోమవారం నాగ్సాన్‌పల్లి శివారులోని సంతోషిమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆశీర్వచనాలుచేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతీ స్వామీజీ మాట్లాడుతూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్ శర్మ, శ్యామ్‌సుందర్‌శర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బిజెపి విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలి





మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**నర్సాపూర్, మార్చి 4, ప్రభాతవార్త:**

నేడు(మంగళవారం) పటాన్‌చెరు, సంగారెడ్డిలో నిర్వహిస్తున్న బిజెపి విజయ సంకల్ప మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నర్సాపూర్ సభ ఇన్‌చార్జీ మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన పటాన్‌చెరు, సంగారెడ్డి పట్టణాలలో బిజెపి విజయ సంకల్పయాత్రలో భాగంగా బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభను అందరు కలిసి విజయవంతం చేయాలని వారు కోరారు. అంతేగాక రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, మెదక్ ఎంపి స్థానాల్లో బిజెపి జెండాను ఎగరేయాలని వారు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ప్రబారి బసవ లక్ష్మినర్సయ్య ,ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, కౌన్సిలర్ గోడ రాజెందర్, ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్, కౌన్సిలర్‌లు బుచ్చేష్ యాదవ్, సంగసాని సురేశ్, ఎరుకలి యాదగిరి, నర్సాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ సతీష్‌యాదవ్, మాజీ సర్పంచ్ హెచ్‌వి. రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌గుప్త, ఓబిసి జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నాగేశ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య, శక్తి కేంద్రం ఇంచార్జీ బోర్‌వెల్ రామ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తదితరులు

## శేరిలా మల్లన్న జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**వెల్దుర్తి, మార్చి4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శేరిలా గ్రామంలో రెండు రోజుల నుండి మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలను యాదవులు ఘనంగా నిర్వహిస్తున్నారు. యాదవుల ఆరాధ్య దైవమైన మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉదయం అగ్నిగుండాలు, మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి జాతర ఉత్సవాల్లో పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరొందిన మల్లికార్జున స్వామికి ఒడి బియ్యంతో పాటు మొక్కలు తీర్చుకున్నారు. మల్లన్న జాతర ఉత్సవాల్లో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు విశేషంగా పాల్గొని మల్లికార్జున స్వామికి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా యాదవులు ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



మిర్జాపల్లిలో మల్లన్న దేవాయలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**చిన్నశంకరంపేట, మార్చి 4, ప్రభాతవార్త:** ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధి మిర్జాపల్లిలో మల్లన్న జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. గ్రామంలోని సీసీ రహదారికి నిధులను మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా రూ.5లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మనోజ్, నాయకులు సిద్ధిరాములు, జనార్ధన్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

## నరేంద్రమోడి బహిరంగ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బండారు మహేష్

**గజ్వేల్, మార్చి 4 (ప్రభాతవార్త):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో నేడు జరగబోయే నరేంద్రమోడి బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి గజ్వేల్ నియోజకవర్గ నాయకులు బండారు మహేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి మంగళవారం పటాన్‌చెరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారని, అనంతరం విజయ సంకల్ప సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజలు, బిజెపి శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్ళి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు పెండ్యాల శ్రీనివాస్, పంజాల వెంకటేష్‌గౌడ్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ ఆనంద సాయిగౌడ్, మండల ఉపాధ్యక్షుడు నడిగుప్పుల వినోద్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు మర్కంటి ఏగొండ, నాయకులు ఐల మహేందర్, శరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కనకయ్య

**గజ్వేల్ టౌన్, మార్చి 4 (ప్రభాతవార్త):** గజ్వేల్ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను సోమవారం లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయనతో పాటు సీనియర్ నాయకుడు కుర్రె మహేందర్‌రెడ్డి ఉన్నారు.

## 5 ఏళ్లలో బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యం

**బెజ్జంకి, మార్చి 4, ప్రభాతవార్త :** కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ గెలిచిన ఐదేళ్ల నుంచి చేసిన అభివృద్ధి శూన్యమని బిఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు బిగుల్ల మోహన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కేవలం ఆయన స్వార్థం, బిజెపి కోసమే రాజకీయం చేశాడేతప్ప ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. గతంలో ఎంపిగా పనిచేసిన బోయినపల్లి వినోద్‌కుమార్ హయాంలో కేంద్ర నుంచి నిధులు మంజూరు చేయించి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు అండగా నిలిచి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



ఎమ్మెల్యకు ఆలయ ఉత్సవాలకు ఆహ్వానపత్రిక అందిస్తున్న మాజీ సర్పంచి

## శ్రీసోమేశ్వర ఆలయ ఉత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత

**చిన్నశంకరంపేట, మార్చి 4, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీసోమేశ్వర ఆలయ ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే రోహితరావుకు సోమవారం మాజీసర్పంచి రాజిరెడ్డి ఆహ్వాన పత్రికను అందించారు. ఆయనవెంట యాదవరావు, జీవన్, కోడూరి రమేష్‌గౌడ్, మేడి గణేష్ ఉన్నారు.

## సంగమేశ్వర ఆలయ ఉత్సవాలకు...

**చిన్నశంకరంపేట, మార్చి 4, ప్రభాతవార్త:** మండల పరిధి రుద్రారంలోని శ్రీ సంగమేశ్వర ఆలయ 75వ బ్రహ్మోత్సవాలకు హజరు కావాలని మాజీ సర్పంచి మంచాల లక్ష్మణ్ ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ఆహ్వాన పత్రికను అందించారు. ఆయన వెంట చందంపేట మాజీ సర్పంచి వడ్ల సిద్దిరాములు, సంగమేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు బిక్షపతి, ఆకుల సిద్దిరాములు, నల్ల శ్రీనివాస్, మాసాయిపేట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాలున్న ఆహారంతో ఆరోగ్యం



గర్భిణిలకు సీమంతం నిర్వహిస్తున్న ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు శివకుమారి

**చిన్నశంకరంపేట, మార్చి 4, ప్రభాతవార్త:** గర్భిణీలు పోషకాలు ఉన్న ఆహారం తిసుకోవాలని ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు శివకుమారి తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు, శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు పోషకాహారం ఉన్న ఆహారం తిసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు తప్పకుండా పట్టాలని, దాని ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం పిల్లల తల్లితండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ములుగులో ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు



ములుగులోని సేవాకేంద్రంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపిపి లావణ్య

**ములుగు, మార్చి 4 (ప్రభాతవార్త):** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా 6 గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎంపిపి పెద్దబాల్ లావణ్య అంజన్‌గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం ఆరు గ్యారంటీలు అమలుపర్చడంకోసం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం లబ్ధిదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాల కోసం నమోదు చేసుకోని వారు, చేసుకున్న వారు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు పొందలేకపోతే ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఆశ్రయించి దరఖాస్తు చేసుకున్నట్లయితే అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపిటిసి మధుసూదన్‌రెడ్డి, పివిఆర్‌కె. శర్మ, సూపరింటెండెంట్ రామచంద్రం, ఎంపిఓ నరసింహారావు, నాయకులు గణేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీ సర్పంచ్‌లు



కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న తాజీ మాజీ సర్పంచ్‌లు

మిరుదొడ్డి, మార్చి 4, ప్రభాతవార్త : మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచ్‌లు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మల్లుపల్లి తాజా మాజీ సర్పంచ్ భారతిభూపతిగౌడ్, అందె తాజా మాజీ సర్పంచ్ చుక్క శంకర్, ధర్మారం మాజీ సర్పంచ్ గుల్ల పుష్పబాగులు, కాసులాబాద్ చంద్రమౌళి, అల్వాల కిష్టయ్య లక్ష్మీనగరం నర్సింహ్మారెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాకప్పి పార్టీలోకి అహ్వానించారు. కార్యక్రమంలో తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి(అమర్) తదితరులు పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**మనూర్, మార్చి 4, ప్రభాతవార్త:** ఈ నెల 6వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే కార్యక్రమానికి మండల సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

## శ్రీశైలం వెళుతున్న శివస్వాములు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలోని శ్రీశైలంకు మండలంలోని మల్గి గ్రామంలోని శ్రీ నవనాథ్ సిద్దేశ్వర గవి గాట్ సన్నిదానం నుంచి శివస్వాములు శ్రీశైలంకు బయలెక్కారు. ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇరుముడిలు తలపై పెట్టుకుని శివనామస్మరణతో శ్రీశైలంకు పయనమయ్యారు.

## నీరు వృధాగా పోతున్నా పట్టించుకోరా ?



నారాయణాపూర్‌లో వృధాగా పోతున్నా తాగునీరు

**నర్సాపూర్, మార్చి 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో మంచి నీటి బోర్ నుండి నీరు వృధాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామానికి చెందిన బాబాయ్ తెలిపారు. ప్రభుత్వ మంచి నీటి బోర్‌ను స్టార్ట్ చేసి అలాగే రోజంతా ఉంటుందని ఈ మేరకు ఈ బోర్ మోటార్‌ను బంద్ చేసే వారేలేరని అన్నారు. దీంతో మంచి నీళ్ళన్ని వృధాగా పోతున్నాయని తెలిపారు. ఈ వేసవీ కాలంలో మంచి నీటికోసం అవస్థలు పడవల్సి వస్తుందన్నారు. ఈమేరకు గ్రామ కార్యదర్శి గాని పంచాయతీ పాలకులు గాని మంచి నీటి బోర్ నుండి వృదాగా పోతున్నా నీరును నిలిపి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంతేగాక గ్రామంలో మంచినీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## భూపాల్‌రెడ్డికి జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

### -బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీపంతులు

**పెద్దశంకరంపేట, మార్చి 4 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డికి జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మురళీపంతులు అన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడిగా ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు తోడుగా ఉండి అత్యంత ప్రజాదరణ గల బలమైన అభ్యర్థిగా పేరుగాంచిన మహారెడిన భూపాల్‌రెడ్డికి జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఇస్తే ఘన విజయం సాధిస్తారని ఆయన అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు ఎన్నో చేసి అన్ని విధాలుగా, అన్ని వేళలా అందరికి అందుబాటులో ఉండే భూపాల్‌రెడ్డికి జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ఇస్తే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి సమన్వయంతో కష్టపడి గెలిపించుకుంటామని పార్టీ అధిష్టాన్ని కోరుతున్నామని తెలిపారు.

## గోడను తొలగించిన అధికారులు



సంఘటన స్థలంలో అధికారులు

**వెల్దుర్తి, మార్చి 4 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలంలోని బొమ్మారం గ్రామం వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ మాసాయిపేట, బొమ్మారం గ్రామాలకు అడ్డంగా గోడ కట్టడంతో స్టేషన్ మాసాయిపేట ఎంపీటీసీ నవనీత శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం స్థానిక తహశీల్దార్ జ్ఞానజ్యోతి, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించారు. దీంతో వారికి ఎంపీటీసీ నవనీత శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



సీజ్ చేసిన వాహనాలు

## ద్విచక్ర వాహనాల సీజ్

**చిన్నశంకరంపేట, మార్చి 4, ప్రభాతవార్త:** పట్టణంలో సోమవారం సాయంత్రం మిర్జాపల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీలో ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి దృవ పత్రాలు, నెంబర్ ప్లెట్ లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ ద్విచక్రవాహనాలకు ఎలాంటి ధృవపత్రాలు లేవని, నెంబర్ ప్లెట్ కూడ లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వాహన యజమానులు వాహన దృవ పత్రాలు, భీమా, పొల్యూషన్ పత్రాలు వెంట పెట్టుకోవాలని, లేదా ఆర్టీఏ ఎం వ్యాలెట్ యాప్‌లో పొందుపర్చుకోవాలని సూచించారు.

## ఎదురెదురుగా వస్తున్న ఆటో-ద్విచక్రవాహనం ఢీ

### -ఐదుగురికి తీవ్ర గాయాలు

**కొల్చారం, మార్చి4 ప్రభాతవార్త:**

ఎదురెదురుగా వస్తున్న ఆటో-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారు లోని హనుమాన్ బండల్ సమీపంలోని బ్రిడ్జి వద్ద జరిగింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు, అలాగే ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఘటనస్థలానికి ఎస్ఐ మహమ్మద్ గౌస్ చేరుకొని మూడు అంబులెన్స్‌ల్లో క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



సంఘటన స్థలంలో క్షతగాత్రులు